

పథకం ప్రకారమే మారణాయుధాలతో దాడి

- పెదరాంభద్రపురంలో వ్యక్తి హత్య కేసులో 13 మంది అరెస్టు
- ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా వెల్లడి

-7లో



మీడియా సమావేశంలో ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



దేవరాపల్లిలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఫొటోలను భోగిమంటల్లో దహనం చేస్తున్న దృశ్యం

అంగన్‌వాడీల ఆందోళన ఉధృతం

దీక్షా శిబిరాల వద్ద భోగి మంటలు

- ఎస్మా జీవో కాపీలు, షోకాజ్ నోటీసులు దహనం
- పండుగ పూట పస్తులుంచిన ఘనత ప్రభుత్వానికే దక్కుతుందని ఎద్దేవా
- వచ్చే ఎన్నికల్లో వైసీపీకి తమ సత్తా చూపుతామని హెచ్చరిక
- 33వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

(ఆంధ్రజ్యోతి- న్యూస్‌నెట్‌వర్క్)

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని, తదితర డిమాండ్లతో అంగన్ వాడీలు చేపట్టిన సమ్మె శనివారంనాటికి 33వ రోజుకు చేరింది. గత ఎన్నికల ముందు అప్పుడు ప్రతిపక్ష నేతగా వున్న జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను, అధికారంలోకి వచ్చి నాలుగురేళ్లయినా అమలు చేయకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నదని అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా వైసీపీ పాలకుల తీరును నిరసిస్తూ శనివారం అన్ని ధర్నా శిబిరాల వద్ద పలు రూపాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా దీక్షా శిబిరం వద్ద భోగిమంటలు వేసి ఎస్మా జీవో కాపీలు, అంగన్‌వాడీలకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను మంటల్లో వేసి దహనం చేశారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపకుండా బెదిరింపులకు పాల్పడటం దుర్మార్గమని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. పండుగ పూట లక్షలాది కుటుంబాలను పస్తులు వుంచిన ఘనత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. తమను ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా సమ్మెను విరమించేది లేదని, వచ్చే ఎన్నికల్లో తమ సత్తా ఏమిటో వైసీపీకి చూపికి చూపిస్తామని హెచ్చరించారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి సబ్బవరంలో అంగన్‌వాడీల దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుండా ఎస్మా ప్రయోగించడం దారుణమని అన్నారు. కాగా ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ చీడికాడలో అంగన్‌వాడీలు ఇంటింటికీ వెళ్లి భిక్షాటనతో నిరసన తెలిపారు. అంగన్‌వాడీలపట్ల నీచంగా మాట్లాడరంటూ దేవరాపల్లిలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఫొటోలను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. తమ ఆందోళన వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయని, కావాలనే రాద్ధాంతం చేస్తున్నామని సజ్జల దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



అనకాపల్లిలో ఎస్మా జీవో కాపీలు, షోకాజ్ నోటీసులను భోగిమంటల్లో దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

ఆవఖండంలో రియల్ దందా!

- గ్రావెల్‌తో లేఅవుట్‌గా అభివృద్ధి
- తెరముందు రియల్ ఎస్టేట్ సంస్థ.. తెరవెనుక వైసీపీ ముఖ్యనేత
- ముంపు ప్రాంతంలో వాల్లాకు తూట్లు
- జాతీయ రహదారి పక్కనే పర్యావరణ విధ్వంసం
- జిల్లా కేంద్రానికి కూత వేటు దూరం
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు

ఎటువంటి అనుమతులు లేకుండా భారీ వెంచర్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో వున్న ఆవఖండం పంట పొలాలపై అధికార పార్టీకి చెందిన బినామీ రియల్టర్లు వాలిపోయారు. రైతుల నుంచి భూములు కొనుగోలు చేసి, ప్రభుత్వ శాఖల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇళ్ల స్థలాల లేఅవుట్ కోసం పనులు చేపట్టారు. భూమి మార్పిడి ఫీజు (నాలా) కూడా చెల్లించలేదు. చుట్టుపక్కల గ్రామాల్లో కొండ ప్రాంతాల నుంచి రాత్రిపూట గ్రావెల్ తీసుకువచ్చి ఆవఖండం భూములను ఎత్తు చేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన ముఖ్య నేత ఒకరు, ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థను తెరముందుకు తీసుకువచ్చి ఇక్కడ భారీ వెంచర్ వేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



అనకాపల్లి ఆవఖండంలో రియల్టర్లు చదును చేస్తున్న భూములు

జిల్లాల పునర్విభజన తరువాత కొత్త జిల్లా కేంద్రమైన అనకాపల్లి, పరిసరాల్లో భూముల విలువ గణనీయంగా పెరిగింది. దీంతో ఇళ్ల స్థలాలకు గిరాకీ ఏర్పండి. ధరలకు రెక్కలొచ్చాయి. ప్రస్తుతం అనకాపల్లి, పరిసరాల్లో రహదారుల పక్కన సెంటు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు పలుకుతోంది. దీంతో వైసీపీ ముఖ్యనేత ఒకరు పట్టణానికి సమీపంలో, జాతీయ రహదారికి అనుకుని వున్న ఆవఖండం భూములపై కన్నేశారు. ఒక ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థను తెరపైకి తెచ్చారు. ఆవఖండం ముంపు ప్రాంతం కాబట్టి ఈ భూములు వ్యవసాయానికి తప్ప ఇతర అవసరాలకు పనికిరావని, ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు వచ్చే ప్రసక్తే లేదంటూ రైతులను భయపెట్టారు. తమకు విక్రయిస్తే తగిన ధర చెల్లిస్తామని చెప్పారు. దీంతో పలువురు రైతులు తమ భూములను అమ్ముకున్నారు. అనంతరం రియల్టర్లు ఆవఖండం భూముల్లో వెంచర్ అభివృద్ధి పనులు మొదలుపెట్టారు. వ్యవసాయేతర అవసరాలకు వినియోగించుకొనేందుకు (ల్యాండ్ కన్వర్షన్) అనుమతులు పొందలేదు.



భారీ వర్షం కురిస్తే జలాశయాన్ని తలపిస్తున్న ఆవఖండం భూములు (ఫైల్ ఫొటో)

అనుమతులు ఇవ్వరని తెలిసినా...

అనకాపల్లికి దిగువ ప్రాంతంలో ఉండడంవల్ల పట్టణంలో కురిసిన వర్షంతోపాటు కొంత వాడుక నీరు (డ్రైనేజీ) కూడా ఆవఖండంలోకి చేరుతుంది. చిన్న వర్షం పడితే చాలు ఆవఖండం భూములు ముంపునకు గురవుతుంటాయి. ఈ భూములు నివాస యోగ్యం కాదని, భవన నిర్మాణాలు చేపట్టడానికి అను కూలం కాదని గతంలోనే పర్యావరణ శాఖ స్పష్టం చేసింది. గతంలో ఆవఖండం భూముల్లో ఒక సంస్థ లేఅవుట్ వేసేందుకు ప్రయత్నించగా స్థానికులు కొందరు ఫిర్యాదు చేయడంతో పనులు నిలిపేశారు. కొత్త జిల్లా ఏర్పడిన తరువాత కలెక్టరేట్ భవన సముదాయం నిర్మాణానికి ఆవఖండంలో వున్న తన భూముల్లో 10 ఎకరాలు ఉచితంగా ఇస్తానని ఓ రైతు ముందుకు వచ్చారు. అయితే పర్యావరణ శాఖ అధికారులతోపాటు స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆ ప్రతిపాదన బుట్టదాఖలైంది. అయినా సరే అధికారం చేతిలో వుందన్న ధీమాతో వైసీపీ ముఖ్య నేత ఒకరు, రియల్ ఎస్టేట్ సంస్థను తెరపైకి తీసుకువచ్చి ఆవఖండం భూముల్లో వెంచర్ వేస్తున్నారు. భూములను ఎత్తు చేయడానికి, రోడ్లు వేయడానికి అవసరమైన గ్రావెల్ రవాణా కాంట్రాక్టును స్థానిక వైసీపీ నేతలకు ఇచ్చారు. సమీపంలోని కుంచంగి, జమాదులపాలెం, కొండకొప్పాక, భట్లపూడి, గొలగాం ... మిగతా 6వ పేజీలో

ఎట్టకేలకు మోక్షం

గోవాడ చెరకు రైతులకు పాత బకాయిలు విడుదల
కార్మికులకు రెండు నెలల వేతనాలు కూడా ..

- మూడు నెలలపాటు ఊరించి.. నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- ఫ్యాక్టరీ ఖాతాకు జమ
- బ్యాంకులకు వరుసగా మూడు రోజులు సెలవులు
- 15 నుంచి రైతులు, కార్మికుల ఖాతాల్లో జమ

చోడవరం, జనవరి 13: **గోవాడ షుగర్ ఫ్యాక్టరీ సభ్య రైతులకు చెరకు బకాయిలు, కార్మికుల వేతన బకాయిలను ప్రభుత్వం ఎట్టకేలకు విడుదల చేసింది. దీంతోపాటు రిటైర్డ్ కార్మికులకు గ్రాట్యుటీ, విద్యుత్ బిల్లుల చెల్లింపునకు మొత్తం రూ.12.8 కోట్లు షుగర్ ఫ్యాక్టరీ ఖాతాకు జమఅయ్యాయి. అయితే బ్యాంకులకు వరుసగా మూడు రోజులపాటు సెలవులు రావడంతో పండుగ అనంతరం రైతులు, కార్మికుల బ్యాంకు ఖాతాలకు మంగళవారం నుంచి డబ్బులు జమ అవుతాయని అధికారులు తెలిపారు.**



గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో గత క్రషింగ్ సీజన్‌లో 2 లక్షల 21 వేల 246 టన్నుల చెరకు క్రషింగ్ జరిగింది. టన్నుకు రూ.2821.25 చొప్పున రైతులకు రూ.62.41 చెల్లించాలని. కానీ యాజమాన్యం టన్నుకు రూ.2,500 చొప్పున రూ.55.26 కోట్లు మాత్రమే చెల్లించింది. టన్నుకు రూ.321 చొప్పున రూ.7.11 కోట్లు బకాయిలు ఉండిపోయాయి. అలాగే ఫ్యాక్టరీకి నేరుగా చెరకు సరఫరా చేసిన రైతులకు రవాణా చార్జీల కింద రూ.2.19 కోట్లు చెల్లించాల్సి వుంది. అదే విధంగా కార్మికులకు కూడా రెండు నెలల వేతన బకాయిలు వున్నాయి. క్రషింగ్ ముగిసి ఆరు నెలలు దాటినా బకాయిలు ఇవ్వకపోవడంతో రైతులు, ఫ్యాక్టరీ యాజమాన్యం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆందోళనలు కూడా నిర్వహించారు. ఈ నేపథ్యంలో గత ఏడాది సెప్టెంబరు 29న జరిగిన షుగర్స్ మహాజన సభలో చెరకు రైతులకు బకాయిలు, కార్మికుల వేతనాల కోసం సీఎం రూ.12.3 కోట్లు మంజూరుచేశారని, రెండు రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాలకు జమ అవుతాయని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ ప్రకటించారు. కానీ ఎన్ని రోజులు వేచిచూసినా చెరకు బకాయిలు అందకపోవడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. నవంబరు 16న చెరకు రైతుల బకాయిలు, కార్మికుల వేతనాలకు రూ.12.5 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయినాసరే ... మిగతా 6వ పేజీలో

రైళ్లు, బస్సులకు సంక్రాంతి తాకిడి

సొంతూళ్లకు వెళ్లే వారితో రద్దీగా ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్

అనకాపల్లి టౌన్, జనవరి 13:

ఉద్యోగం, వ్యాపారం, చదువులు నిమిత్తం ఇతర ప్రాంతాల్లో నివాసం వుంటున్న వారు సంక్రాంతి పండుగ జరుపుకునేందుకు సొంతూళ్లకు పయనమయ్యారు. ఇంకా ఉపాధి, కూలిపనుల కోసం తాత్కాలికంగా ఇతర జిల్లాలకు వలస వెళ్లిన వారు స్వగ్రామాలకు వెళుతున్నారు. దీంతో అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్‌కు ప్రయాణికుల తాకిడి పెరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు బస్సులన్నీ రద్దీగా నడిచాయి. రైళ్లలో జనరల్ భోగీలు కిటకిటలాడాయి. ఉద్యోగం, ఉపాధి నిమిత్తం సుదూర ప్రాంతాల్లో నివాసం వుంటున్న అనకాపల్లి, ఎలమంచిలి, మాడుగుల, చోడవరం, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ప్రజలు రైళ్లల్లో అనకాపల్లి వచ్చి, స్వగ్రామాలకు వెళ్లడానికి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుంటున్నారు. దీంతో బస్సులకు ప్రయాణికుల తాకిడి పెరిగింది. బస్సు సర్వీసులు నడవని గ్రామాల ప్రజలు ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు.





రైల్వేస్టేషన్ నుంచి స్వగ్రామాలకు వెళ్లేందుకు బయటకు వస్తున్న ప్రయాణికులు. (ఇన్‌సెట్‌లో) పీటీడీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

నర్సీపట్నం కిటకిట

- సంక్రాంతి కొనుగోలుదారులతో రద్దీగా మారిన మార్కెట్లు



నర్సీపట్నం మెయిన్ రోడ్డులో నిలిచిన ట్రాఫిక్

నర్సీపట్నం, జనవరి 13: స్థానిక మార్కెట్లలో శనివారం సంక్రాంతి సందడి కనిపించింది. వస్త్ర దుకాణాలన్నీ కొనుగోలుదారులతో కిట కిటలాడాయి. కొత్త దుస్తులు, ఫ్యాన్సీ, కిరాణా సామగ్రి కొనుగోలు చేయడానికి నర్సీపట్నం, చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రావడంతో మెయిన్ రోడ్డులో వాహనాల రద్దీ పెరిగింది. పాత ఎస్‌బీఐ కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, పెద్ద బొడ్డేపల్లి మదుం వరకు ట్రాఫిక్ అధికంగా వుండి వాహనదారులు ఇబ్బంది పడ్డారు. అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ఫుట్‌పాత్ వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేశారు. షో రూమ్‌లలో అధిక ధరలకు దుస్తులు కొనుగోలు చేసే స్థోమత లేని వారు ఫుట్‌పాత్ దుకాణాల్లో కొనుగోలు చేశారు. కాగా ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శనివారం రద్దీ మరింత పెరిగింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అధికారులు పలు రూట్లలో అదనపు సర్వీసులు, ప్రత్యేక బస్సులు నడిపారు.

తండ్రి అస్థికలు గోదారిలో కలిపి వస్తూ తిరిగిరాని లోకాలకు..

- తాళ్లపాలెం వద్ద కారు బోల్తా పడి వ్యక్తి మృతి
- ముగ్గురికి తీవ్రగాయాలు





తాళ్లపాలెం వద్ద బోల్తా పడిన కారు. (ఇన్‌సెట్‌లో) భాస్కరరావు (ఫైల్ ఫొటో)

కశింకోట, జనవరి 13:

తండ్రి అస్థికలను గోదావరిలో నిమజ్జనం చేసి తిరిగి వస్తుండగా కారు అదుపుతప్పి బోల్తాపడడంతో కుమారుడు మృతిచెందిన విషాదకర సంఘటన శనివారం కశింకోట మండలం తాళ్లపాలెం వద్ద చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మరో కుమారుడితోపాటు ముగ్గురు గాయపడ్డారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పరవాడ మండలం ఈ.బోనంగి ఫార్మాసిటీ పునరావాస కాలనీకి చెందిన రిటైర్డ్ కానిస్టేబుల్ ఈతా నారాయణరావు ఈ నెల పదో తేదీన మృతిచెందారు. అంత్యక్రియలు పూర్తయిన తరువాత అస్థికలను గోదావరిలో నిమజ్జనం చేయాలని కుటుంబ సభ్యులు భావించారు. నారాయణరావు కుమారులు వాసుదేవరావు, భాస్కరరావు (40)తోపాటు దగ్గర బంధువులు ఈతా మురళీగణేశ్, రెడ్డిపల్లి వెంకటరావు, రాచపల్లి గిరిశ్ అచ్యుతకుమార్ కలిసి కారులో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత రెండు గంటల సమయంలో రాజమహేంద్రవరం బయలుదేరారు. శనివారం ఉదయం ఆరు గంటలకు అక్కడకు చేరుకుని, అస్థికలను గోదావరిలో నిమజ్జనం చేసిన అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. అచ్యుతకుమార్‌కు చెందిన కారును (ఎర్టిగా) వాసుదేవరావు డ్రైవ్ చేస్తున్నారు. ఉదయం 8.45 గంటల ప్రాంతంలో ... మిగతా 6వ పేజీలో

ప్రాణం తీసిన మనస్పర్థలు

- భర్తకు మద్యంలో పురుగుల మందు కలిపి ఇచ్చిన భార్య
- తన కుమారుడిని కోడలే హత్య చేసిందని పోలీసులకు తల్లి ఫిర్యాదు

-7లో



బరుకు గోవింద (ఫైల్ ఫొటో)

వెలుగు ఏపీఎం, ముగ్గురు సీసీలు సస్పెన్షన్

- నకిలీ స్వయం సహాయక సంఘాల పేరుతో బ్యాంకు రుణాలు స్వాహా
- విచారణలో నిర్ధారణ కావడంతో డీఆర్‌డీఏ అధికారులు చర్యలు

అనకాపల్లి రూరల్, జనవరి 13: స్వయం సహాయక సంఘాల పేరుతో నకిలీ గ్రూపులు ఏర్పాటు చేసి కోట్లాది రూపాయలు స్వాహా చేసిన కేసులో నలుగురు ఉద్యోగులపై డీఆర్‌డీఏ అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. అనకాపల్లి మండలం సత్యనారాయణపురం, గుండాలవీధి, మరికొన్నిచోట్ల నకిలీ స్వయం సహాయక సంఘాల గ్రూపులు ఏర్పాటు చేసి సుమారు ఎనిమిది కోట్ల రూపాయలను బ్యాంకుల నుంచి రుణాలుగా పొందారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూడడంతో డీఆర్‌డీఏ వెలుగు అధికారులు అప్రమత్తమై విచారణకు ఆదేశించారు. వెలుగు సిబ్బంది, బ్యాంకు అధికారులు కుమ్మక్కై, రుణాల పేరుతో డబ్బులు స్వాహా చేసినట్టు విచారణలో తేలింది. ఇందుకు బాధ్యులైన సత్యనారాయణపురం సీసీని ఇప్పటికే సస్పెండ్ చేశారు. తాజాగా గుండాలవీధిలో అక్రమాలకు సంబంధించి డీఆర్‌డీఏ వెలుగు అనకాపల్లి కార్యాలయానికి చెందిన ఏపీఎం నీలాచలం, సీసీలు ఎంయాజీఆర్ నాయుడు, కొండబాబు, లక్ష్మీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అనకాపల్లి నియోజకవర్గం

అనకాపల్లిలో సెంట్రల్ లైటింగ్ ప్రారంభం


శిలాఫలకం ప్రారంభోత్సవంలో మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్, జనవరి 13 : పట్టణంలోని సుంకర మెట్ట జంక్షన్ నుంచి జాతీయ రహదారిలో గల జలగల మదుం జంక్షన్ వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శనివారం రాత్రి ప్రారంభించారు. ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతితో పాటు 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్న లక్ష్మి, వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'దాడి'ని కలిసిన యాదవ సంఘం నాయకులు


దాడిని కలిసిన యాదవ సంఘం నాయకులు

అనకాపల్లి టౌన్, జనవరి 13 : మాజీ మంత్రి దాడి వీరభద్రరావును అనకాపల్లి జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భరణికాన సాయినాథరావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు శనివారం కలిశారు. లక్ష్మీనారాయణనగర్‌లోని ఆయన క్యాంప్ కార్యాలయానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. దాడిని కలిసిన వారిలో సంఘ పెద్దలు భరణికాన నరసింహమూర్తి, సబ్బి శ్రీనివాసరావు, పంచదార్ల సూరిబాబు, లక్ష్మి, వియ్యపు సింహాచలంయాదవ్, గోకివాడ శ్రీరాములు, ఒమ్మి రాము, కరక రాజు, గోకివాడ లోవకృష్ణ, వియ్యపు శ్రీనివాసయాదవ్, బొట్టా పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ యువజన విభాగం కార్యదర్శిగా 'పలకా'

అనకాపల్లి టౌన్, జనవరి 13 : వైసీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా పట్టణానికి చెందిన పలకా రవి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం నియామకపు ఉత్తర్వులను శనివారం జారీ చేసింది. ఈ సందర్భంగా అతనిని పలువురు అభినందించారు.

ప్రభుత్వం దిగిరాకుంటే పోరు ఉధృతం

▸ అంగన్‌వాడీలు స్పష్టీకరణ ▸ అనకాపల్లిలో ఎస్మా కాపీ ప్రతులు దహనం ▸ పరవాడ, సబ్బవరం దీక్షా శిబిరాల్లో నినాదాలు


సబ్బవరంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు

అనకాపల్లి టౌన్, జనవరి 13 : అంగన్‌వాడీల సమ్మె ఉధృతమవుతోంది. రోజుకో రూపంలో తమ నిరసనను ప్రభుత్వానికి తెలియజేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం పట్టణంలోని నెహ్రూచౌక్‌లో గల బస్ స్టాప్ వద్ద ఎస్మా జీవో, విధులకు హాజరు కావాలని జారీచేసి ప్రతులను భోగిమంటలో వేసి తగులబెట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి చొరవ చూపకుండా ఎస్మా, షోకాజ్ నోటీసులతో బెదిరింపులకు పాల్పడుతుండడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగిరాకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు డీడీ వరలక్ష్మి, అంగన్‌వాడీల సంఘం నాయకురాళ్లు ఉమా నారాయణమ్మ, కృష్ణవేణి, లక్ష్మి, తనూజ, కాసులమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : అంగన్‌వాడీలు చేపట్టిన ఆందోళన 32వ రోజుకు చేరుకుంది. ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని శనివారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు సందర్శించి సంఘీభావం తెలిపారు. వీరి డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు అక్కమ్మ, ఎం.రమణి, సీహెచ్.దేవి, ఈశ్వరమ్మ, సత్య ఉమా తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా శనివారం చెవిలో పూలు పెట్టుకుని ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేశారు. వీరికి ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుండా ఎస్మా ప్రయోగించడం ప్రభుత్వానికి తగదన్నారు. అంగన్‌వాడీల వెంట అనేక ప్రజా సంఘాలతో పాటు పలు రాజకీయ పార్టీలు ఉన్నాయన్నారు.


అనకాపల్లిలో జీవో ప్రతులు దహనం


పరవాడలో మాట్లాడుతున్న సీఐటీయూ నేత శంకరరావు

ఈ ఆందోళన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, ప్రాజెక్టు అధ్యక్షురాలు వీవీ రమణమ్మ, ఎం.వరలక్ష్మి, జగదేశ్వరి, దేవీ తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి నియోజకవర్గం

పరవాడ సీఐగా బాలసూర్యారావు బాధ్యతలు


సీఐ బాల సూర్యారావు

పరవాడ, జనవరి 13 : పరవాడ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి. బాలసూర్యారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా ఎస్.కోట స్టేషన్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న పెదిరెడ్ల ఈశ్వరరావు శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కొత్త సీఐ మాట్లాడుతూ అందరి సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని వెల్లడించారు. స్టేషన్ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు.

'బీజేపీ పాలనలో దేశం పురోభివృద్ధి'

సబ్బవరం, జనవరి 13 : బీజేపీ పాలనలో దేశం పురోభివృద్ధి సాధిస్తుందని ఆ పార్టీ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు అన్నారు. అసకపల్లి, గొల్లలపాలెం గ్రామాల్లో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహించి మాట్లాడారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనం సత్యనారాయణ, ఏవో షేక్ బాబూరావు, సర్పంచ్ కర్రి నర్సింగరావు, ఎంపీటీసీ కర్రి అప్పారావు, నియోజకవర్గం కో-కన్వీనర్ రెడ్డి రామునాయుడు పాల్గొన్నారు.

భూ హక్కు చట్టం రద్దుకు రైతు సంఘాల ధర్నా

▸ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు

అనకాపల్లి టౌన్, జనవరి 13 : కొత్త భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ నెహ్రూచౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వివిధ రైతు సంఘాల నాయకులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ భూ హక్కు చట్టం వల్ల ప్రజాప్రయోజనాల కంటే ప్రజల ఆస్తిపై హక్కుకు భంగం ఏర్పడే పరిస్థితులు ఉన్నాయన్నారు. ఏపీ రైతు సంఘం ప్రతినిధులు కర్రి అప్పారావు, నాయనబాబు, కోరిబిల్లి శంకరరావు, రంగారావు, వైఎన్ భద్రం, గాడి బాలు, అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయి వెంకట లక్ష్మణ్, పలు సేవా సంఘాల ప్రతినిధులు దూలం బుసిరాజు, పాత్రపల్లి వీరుయాదవ్, కనిశెట్టి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ పాఠశాలలో అ'పూర్వ' కలయిక


పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అనకాపల్లి టౌన్, జనవరి 13 : జీవీఎంసీ గవరపాలెం ఉన్నత పాఠశాలలో 1976-77 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల శనివారం పాఠశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాంగా పలుకరించుకున్నారు. అనంతరం భవిష్యత్తు కార్యక్రమాలపై చర్చించారు. కమిటీ ప్రతినిధి కాండ్రేగుల సత్యనారాయణ, కన్వీనర్ కాండ్రేగుల దుర్గాప్రసాద్, ప్రోగ్రాం ఆర్గనైజర్‌గా కాండ్రేగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తిరిగిరాని లోకాలకు..

... 5వ పేజీ తరువాయి

తాళ్లపాలెం సమీపంలో బ్రిడ్జి వద్ద కారు అదుపుతప్పింది. ఎడమ వైపున ఉన్న రక్షణ స్తంభాలను ఢీకొని కిందకు దూసుకువెళ్లి బోల్తా పడింది. దీంతో గిరిశ్ అచ్యుతకుమార్ మినహా మిగిలిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. భాస్కరరావు పరిస్థితి ఆందోళనకరంగా వుండడంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. మిగిలిన ముగ్గురు ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గిరీష్ అచ్యుతకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ సుందరమ్మ తెలిపారు.

గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో మేలు కొలుపు

పరవాడ, జనవరి 13 : మండలంలోని వాడచీపురుపల్లి, లంకెలపాలెం, పరవాడ, బొద్దపువానిపాలెం, తానాం, రావాడ, ధర్మారాయుడుపేట, కలపాక, వెన్నెలపాలెం గ్రామాల్లో శనివారం మేలు కొలుపు కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సీతారాముల విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



పరవాడలో భక్తుల మేలుకొలుపు

... 5వ పేజీ తరువాయి

పరిసరాల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వి, రాత్రి వేళ్లలో ట్రాక్టర్లు, టిప్పర్లలతో ఆవఖండం భూములకు చేరుస్తున్నారు.

ఫిర్యాదులు చేసినా పట్టించుకోని రెవెన్యూ

వ్యవసాయ భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్ వేయాలంటే స్థానిక రెవెన్యూ అధికారులతో పాటు వీఎంఆర్‌డీఏ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ సదరు

ఆవఖండంలో రియల్ దందా!

రియల్ ఎస్టేట్ సంస్థకు తెరవెనుక అధికార పార్టీ ముఖ్యనేత వుండ డంతో ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకో వడా నికి వెనకడుగు వేస్తున్నట్టు తెలిసింది. ఆవఖండం భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా రియల్ వెంచర్ వేసేందుకు పనులు చేస్తుండం, గ్రావెల్‌ను అక్రమ రవాణా చేస్తుండడంపై స్థానికులు పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కాగా ఆవఖండం భూము ల్లో అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ వెంచర్ పనులు జరుగుతుండడంపై వీఆర్‌ఓ నాగరాజును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, రియల్ ఎస్టేట్ లేఅవుట్ వేస్తున్నట్టు ఫిర్యాదు అం దినమాట వాస్తవమేనని చెప్పారు. వెంచర్ పనులు నిలిపేసి, కన్వర్షన్ ఫీజు చెల్లించిన తరువాతే పనులు చేపట్టాలని సదరు రియల్ ఎస్టేట్ సంస్థకు నోటీసులు జారీ చేశామని తెలిపారు.

ఎట్టకేలకు మోక్షం

... 5వ పేజీ తరువాయి

రైతులు, కార్మికుల బ్యాంకు ఖాతాలకు బకాయిలు జమకాలేదు. రైతులు ఫ్యాక్టరీకి వచ్చి వాకబు చేస్తుంటే.. అదిగో ఇదిగో అంటూ అధికారులు నెట్టుకొస్తున్నారు. జీవో విడుదలైనప్పటికీ ఫ్యాక్టరీ ఖాతకు డబ్బులు జమకాకపోవ డంతో స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పలుమార్లు ప్రదక్షిణలు చేయగా ఎట్టకేలకు రైతులకు, కార్మికులకు బకాయిల చెల్లింపు కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. శుక్రవారం రాత్రి ఫ్యాక్టరీ ఖాతాలో రూ.12.8 కోట్లు జమ అయ్యాయి. వీటిలో రూ.7.11 కోట్లు చెరకు బకాయిలు, రూ.2.19 కోట్లు రవాణా చార్జీలు, రూ.2 కోట్లు కార్మికుల వేతన బకాయిలు, రూ. కోటి రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లింపు, రూ.50 లక్షలు విద్యుత్ బకాయిల కోసం కేటాయింపులు జరిగాయి. శనివారం నుంచి సోమవారం వరకు బ్యాంకులకు వరుస సెలవులు కావడంతో సంక్రాంతి అనంతరం మంగళవారం నుంచి రైతులు, కార్మికుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని పేర్కొన్నారు.

పాయకరావుపేట నియోజకవర్గం


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదారుస్తున్న అనిత

నూకరాజు హంతకులను కఠినంగా శిక్షించాలి

▸ బాధిత కుటుంబానికి న్యాయం జరిగేవరకు పోరాడతాం

▸ తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత

పాయకరావుపేట రూరల్, జనవరి 13: గంపల నూకరాజును హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత అన్నారు. పెదరాంభద్రపురం గ్రామంలో గురువారం రాత్రి జరిగిన ఘర్షణలో హత్యకు గురైన జి.నూకరాజు కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఒక దళిత సర్పంచ్ భర్త, వారి సోదరుల మీద దాడికి దిగి హత్య చేసి 40 గంటలైనా పోలీసులు ఒక్కరినీ అరెస్టు చూపించలేదన్నారు. అంతేకాకుండా హత్య చేసినవారు ఇక్కడున్న వారికి ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని ఆరోపించారు. నిందితుల నుంచి ఫోన్లు ఎందుకు తీసుకోలేదని పోలీసులను ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసేవరకూ పోరాడుతూనే ఉంటామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, పి.శ్రీను, అబద్దం, కె.వెంకటేశ్వరరావు, సిహెచ్.ప్రదీప్, ఎస్.వి.నాగేశ్వరరావు, సీతారామ్, కృష్ణప్రసాద్, ఏసుగు చిన్నా తదితరులు పాల్గొన్నారు.



రాంబిల్లి: భోగి మంటల్లో జీవో-2, ఎస్మా ప్రతులను వేసి అంగన్‌వాడీల నినాదాలు... నక్కపల్లి: భోగి మంటల్లో నోటీసు ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

భోగి మంటల్లో ఎస్మా, జీవో, నోటీసు ప్రతులను దహనం చేసి నిరసన

ఎలమంచిలి/రాంబిల్లి/అచ్యుతాపురం/మునగపాక/ఎస్.రాయవరం/నక్కపల్లి/, జనవరి 13: అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో విధుల్లోకి హాజరుకాకుండా నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. 33వ రోజు ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా ఎలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో శనివారం భోగి మంటలు వేసి, వాటిలో ఎస్మా, నోటీసు ప్రతులను వేసిన దహనం చేశారు. అలాగే ప్రభుత్వం మొండివైఖరిని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఎలమంచిలిలో అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె చేపడుతున్నారు. అంగన్‌వాడీలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన సీఎం జగన్, ఇప్పుడు మాట తప్పి ఇబ్బందులు పెట్టడం సరికాదని వారు అసహనం వ్యక్తం చేశారు. నక్కపల్లిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు భోగి మంటల్లో ఎస్మా, జీవో, నోటీసు ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ప్రభుత్వ హెచ్చరికలకు భయపడేది లేదని యూనియన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి తదితరులు పాల్గొన్నారు. అచ్యుతాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా అంగన్‌వాడీలు జీవో కాపీ ప్రతులను తగులబెట్టారు. ప్రభుత్వం దిగొచ్చి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంతవరకు ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రొంగలి రాము, కూండ్రపు సోమునాయుడు పాల్గొన్నారు.

మునగపాక మండలంలో అంగన్‌వాడీలు భోగి మంటల్లో జీవో, నోటీసు ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నేత వరలక్ష్మి మాట్లాడుతూ పండగ పూట లక్షలాది కుటుంబాలను రోడ్డు పాలు చేసిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. జీవోలు, షోకాజ్ నోటీసులు జారీ చేసినా తగ్గేదేలేదని, తమ సత్తా ఈ ప్రభుత్వానికి చూపుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధులు వీవీ శ్రీనివాసరావు, రామలక్ష్మి, అంజలి, లక్ష్మి, బేబీ పాల్గొన్నారు. రాంబిల్లి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో భోగి మంటలు వేసి అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఆ మంటల్లో ఎస్మా, జీవో, నోటీసు ప్రతులను దహనం చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు చేస్తున్న న్యాయ పోరాటానికి అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలియజేస్తున్నారన్నారు. అయినా ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం బాధాకరమని వాపోయారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు. ఎస్.రాయవరం తాహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు శనివారం ముగ్గులు వేసి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు లక్ష్మి, సీతారత్నం, వెంకటలక్ష్మి, పద్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.


మునగపాక: భోగి మంటలో జీవో ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ఎస్.రాయవరం, జనవరి 13: ఇటీవల సంభవించిన మిచౌంగ్ తుఫాన్ కారణంగా ధర్మవరం అగ్రహారంలో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. ఈ మేరకు శనివారం రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు తాహసీల్దార్ విజయకుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ మిచౌంగ్ తుఫాన్ సమయంలో సీఎం జగన్ పంట నష్టపోయిన రైతులకు సంక్రాంతి పండగ వచ్చేసరికి పరిహారం అందిస్తామని ప్రకటించారని, ఇందులో భాగంగానే తాహసీల్దార్‌కు వినతిపత్రం అందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాల సొసైటీ అధ్యక్షుడు కర్రి బాబూరావు, మాజీ అధ్యక్షుడు శ్రీపాదుల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ఎస్.రాయవరం, జనవరి 13: మండలంలోని రేవుపోలవరం, కొత్త రేవుపోలవరం గ్రామాల్లో వృద్ధులకు ముసలమ్మ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు శనివారం దుప్పట్ల పంపిణీ చేశారు. ట్రస్టు ద్వారా పేద ప్రజలకు పలు సేవలందించాలన్నదే ముఖ్యోద్దేశమని ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ బంగారు చిట్టి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చోడిపల్లి గోవింద్, నాయకులు జి.రాజేష్, చోడిపల్లి గంగరాజు, ముసిలి, ధోని పాల్గొన్నారు.

దిమిలిలో ముగ్గుల పోటీలు


విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

రాంబిల్లి, జనవరి 13: మండలంలోని దిమిలి గ్రామంలో సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని జనసేన నాయకులు శనివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు వి.నూకన్నదొర గ్రామ పెద్దలతో కలిసి పోటీలను ప్రారంభించారు. దిమిలి పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు పోటీలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో దిమిలి మాజీ సర్పంచులు సేనాపతి నాగేశ్వరరావు, శిగిరెడ్డి శివప్రసాద్, జనసేన పార్టీ నాయకులు ఉరిటి నానాజీ, కర్రి నాని, భూపతి అప్పలనాయుడు, గంగరాజు, నాగరాజు, బద్రి, నర్సింగ్, గొర్లె నాని, జన సైనికులు మహిళలు పాల్గొన్నారు.

చోరీల నివారణకు పోలీసులు మైక్ ప్రచారం

ఎలమంచిలి, జనవరి 13: సంక్రాంతి పండగ సందర్భంగా ఇళ్లు విడిచి వేరే ప్రాంతాలకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు పాటించి చోరీలు జరగకుండా సహకరించాలని కోరుతూ పట్టణంలో పోలీసులు శనివారం మైక్ ద్వారా ప్రచారం చేశారు. ఇతర గ్రామాలకు వెళ్లేవారంతా తమ ఇళ్లల్లో విలువైన వస్తు సామగ్రి ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే ముందస్తుగా సమీప పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని మైక్ ద్వారా ప్రచారం ద్వారా పోలీసులు విజ్ఞప్తి చేశారు.

ఎలమంచిలి నియోజకవర్గం


రద్దీగా ఉన్న ఎలమంచిలి మార్కెట్ వీధి

పట్టణంలో పండగ సందడి

ఎలమంచిలి, జనవరి 13: సంక్రాంతి పండగ పర్వదినాన్ని పురస్కరించుకొని ఎలమంచిలి పట్టణ మార్కెట్ వీధి ప్రజలుతో దర్దీగా మారింది. మార్కెట్‌లో వస్త్ర వ్యాపారులతో పాటు బంగారం, ఫ్యాన్సీ తదితర వ్యాపార సముదాయాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. పండగ కావడంతో ప్రధాన రహదారికిరువైపులా చిరువ్యాపార దుకాణాలు అధిక సంఖ్యలో వెళిశాయి. సంక్రాంతికి వస్తు సామగ్రి కొనుగోలు వచ్చిన వినియోగదారులతో ప్రధాన రహదారి రద్దీగా కనిపిస్తోంది. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

ఐటీడీపీ ఎలమంచిలి ఇన్‌చార్జిగా చిన్నయ్యనాయుడు


నారా లోకేష్‌తో చిన్నయ్యనాయుడు

అచ్యుతాపురం రూరల్, జనవరి 13: ఐటీడీపీ ఎలమంచిలి నియోజవకర్గ ఇన్‌చార్జిగా పతివాడ చిన్నయ్యనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఇంతవరకూ పార్టీ గెలుపు కోసం సామాజిక మాధ్యమాలను, డిజిటల్ మీడియాకు పెద్దపీట వేశానని, ఇకపై సోషల్ మీడియాను ఉపయోగించుకుని నియోజకవర్గంలో టీడీపీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తానని ఈ సందర్భంగా చిన్నయ్యనాయుడు తెలిపారు.

గణపర్తిలో ముగిసిన మేలుకొలుపు

మునగపాక, జనవరి 13: మండలంలోని గణపర్తి గ్రామంలో శనివారం మేలుకొలుపు ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామంలోనే ప్రతి ఏటా మేలు కొలుపు వేడుకలను అట్టహాసంగా నిర్వహిస్తారు. శనివారం తెల్లవారు జాము నుంచి అధిక సంఖ్యలో మహిళలు మేలు కొలుపు కీర్తనలతో గ్రామమంతా ఊరూగింపుగా కలియ తిరిగారు. అనంతరం రామాలయంలో పూజలు చేసి అన్న సమారాధనతో ముగింపు పలికారు.

శ్రీరామ అక్షితల ఊరేగింపు

అచ్యుతాపురం రూరల్: చీమలాపల్లి గ్రామంలో శ్రీరామ పూజ అక్షిత వితరణ శనివారం జరిగింది. సర్పంచ్ సియాద్రి బుజ్జి ఆధ్వర్యంలో సమరసతా సేవా ఫౌండేషన్, గ్రామ ధర్మరక్షా సమితి సభ్యులు జెండాలతో ఊరేగింపు చేశారు. ఇంటింటికీ తిరిగి అక్షితలను అందజేశారు. కార్యక్రమంలో ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు, సిహెచ్.రాజు, మజ్జి రమణ, కుమార్, తోట శ్రీను, శంకర్ పాల్గొన్నారు.

క్రైం... crime news

కత్తితో అన్నపై దాడి

» మద్యం మత్తులో చెవి నరికేసిన తమ్ముడు
» గదభపాలెంలో ఘటన


తీవ్రంగా గాయపడిన చిన్ని సన్యాసి

కొయ్యూరు, జనవరి 13: మద్యం మత్తులో వివాదం చెలరేగి కత్తితో అన్న చెవిని తమ్ముడు నరికేసిన ఘటన గదభపాలెం గ్రామ సమీప కొండపాకల వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. దీనికి సంబంధించి గ్రామస్థులు, మాజీ సర్పంచ్ సూరిబాబు తెలియజేసిన వివరాలు ఇలా వున్నాయి. గదభపాలెం గ్రామానికి చెందిన చిన్ని సన్యాసి, అతని తమ్ముళ్లు ధారకొండ, ఎర్రయ్యలు గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో గల పాటికొండపై రాజులకమ్ముకు సమీపంలో పదేళ్ల క్రితం కొండపై చెట్లు నరికి కొండపోడు చేసుకుంటూ అక్కడే నివాసముంటున్నారు. చిన్ని సన్యాసి తాగుడుకు బానిస కావడంతో అతడిని భార్య వదిలేసింది. అతని తమ్ముడు ధారకొండకు భార్య చనిపోయింది. మరో తమ్ముడు ఎర్రయ్యకు వివాహం అయినప్పటికీ అతని భార్య వదిలి వెళ్లిపోయింది. కాగా శుక్రవారం రాత్రి సన్యాసి, అతని ధారకొండ ఇద్దరు పూటుగా మద్యం సేవించి సారా వాటాల్లో తేడాపై వాదనకు దిగారు. మద్యం మత్తులో ఉన్న ధారకొండ తన అన్న సన్యాసిపై కత్తితో దాడికి చేసి ఎడమ చెవిని నరికేసి పరారయ్యాడు. ఘటన జరిగిన కొండపోడుకు అనుకుని ఉన్న గ్రామానికి చెందిన కవల శ్రీను భూమి ఉండడంతో ఆయన శనివారం ఉదయం అక్కడికి వెళ్లడంతో రక్తపు మడుగులో కొన ఊపిరితో ఉన్న సన్యాసిని గుర్తించి గ్రామానికి సమాచారం అందించాడు. దీంతో సీహెచ్‌డబ్ల్యూ గొర్లి దేముడమ్మ ఘటన స్థలానికి వెళ్లి మాజీ సర్పంచ్ నీలాపు సూరిబాబు, కొయ్యూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కొయ్యూరు ఏఎస్ఐ సింహాచలం గ్రామానికి వెళ్లగా అప్పటికే గ్రామస్థులు క్షతగాత్రుడిని కొండ దించి ఆటోలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కొయ్యూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి

అనకాపల్లి టౌన్, జనవరి 13: మెట్ల మీద నుంచి జారిపడి తీవ్రంగా గాయపడిన మహిళ విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందినట్టు పట్టణ ఎస్ఐ సింహాచలం తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. అనకాపల్లి మండలం సత్యనారాయణపురం శివారు మూలపేట గ్రామానికి చెందిన గెద్ద ఇందిర (28) గత నెల 18వ తేదీన మేడపై ఆరబెట్టిన బట్టలను తీసుకుని మెట్లు దిగుతుండగా అదుపు తప్పడంతో గాయపడింది. అయితే సమస్య తీవ్రంగా లేకపోవడంతో ప్రమాదం లేదని కుటుంబ సభ్యులు భావించారు. అయితే ఈ నెల 11వ తేదీన తలకు నొప్పి రావడంతో స్థానికంగా వైద్య పరీక్షలు చేయించారు. మెదడులో రక్తం గడ్డకట్టినట్టు రిపోర్ట్ రావడంతో డాక్టర్ సలహా మేరకు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. శుక్రవారం ఆపరేషన్ చేశారు. కానీ పరిస్థితి విషమించడంతో కొద్ది గంటల్లోనే మృతిచెందింది. భర్త అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

» ఆరుగురి అరెస్టు

బుచ్చెయ్యపేట, జనవరి 13: పెదమదీనలో పేకాట శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేసి, ఆరుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.40,800ల నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా పేకాట, గుల్లాట, కోడి పందాలు నిర్వహిస్తే కేసులు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

ప్రాణం తీసిన మనస్పర్థలు

» భర్తకు మద్యంలో పురుగుల మందు కలిపి ఇచ్చిన భార్య


సంఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ సుబ్బరాజు

కశింకోట, జనవరి 13: భార్యాభర్తల మధ్య స్పర్థలు, గొడవలు చివరికి భర్త ప్రాణాలు తీశాయి. మద్యంలో పురుగుల మందు కలిపి భర్తను అంతమొందించిది. బయ్యవరం ఎస్సీ కాలనీలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు, కశింకోట సీఐ వినోద్‌బాబు తెలిపిన వివరాలా వున్నాయి. బయ్యవరం గ్రామానికి చెందిన బరుకు గోవింద(43) ఫార్మాసిటీలోని లారస్ కంపెనీలో రోజువారీ కూలీగా పని చేస్తున్నాడు. భార్య శివలక్ష్మి బ్రాండిక్స్‌లో పని చేస్తున్నది. వీరికి తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. భార్యాభర్తల మధ్య సఖ్యత లేకపోవడంతో తరచూ గొడవ పడుతుండేవారు. గోవిందకు మద్యం సేవించే అలవాటు వుంది. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం గోవింద నిద్రపోతుండగా శివలక్ష్మి తలగడను అతని ముఖంపై అదిమిపెట్టి చంపడానికి ప్రయత్నించింది. దీంతో అప్రమత్తమైన గోవింద పెద్దగా కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి శివలక్ష్మిని మందలించారు. ఇదిలా వుండగా శివలక్ష్మి వ్యక్తిగత అవసరాల కోసం అప్పులు చేసింది. వీటిని తీర్చడానికి గోవింద పేరున వున్న 10 సెంట్ల స్థలాన్ని అమ్మివేయాలని పట్టుబడుతున్నది. కానీ భర్త అంగీకరించకపోవడంతో అతనిని కడతేర్చాలని నిర్ణయించుకుంది. శుక్రవారం రాత్రి మద్యంలో పురుగుల మందు కలిపి భర్తకు ఇచ్చింది. తెల్లవారుజామున నిద్రలేచిన గోవింద తల్లి వెంకయ్యమ్మ తన కుమారుడి నోట్లో నుంచి నురగలు రావడం, తట్టి లేపినా చలనం లేకపోవడంతో ఆందోళన చెందింది. కోడలు శివలక్ష్మిని నిలదీయగా తనకేమీ తెలియదని చెప్పింది. ఆస్పత్రికి తీసుకెళ్లడానికి ప్రయత్నించగా అప్పటికే ప్రాణాలు వదిలాడు. అనంతరం వెంకయ్యమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోడలే తన కుమారుడికి మద్యంలో పురుగుల మందు కలిపి ఇచ్చి హత్య చేసిందని ఆమె ఆరోపించారు. క్లూస్‌టీం రంగ ప్రవేశం చేసి ఆధారాలు సేకరించారు. శివలక్ష్మిని అదుపులోకి తీసుకుని విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వినోద్‌బాబు తెలిపారు.

పంట కాలువలోకి దూసుకుపోయిన కారు

» ఒకరికి స్వల్ప గాయాలు, క్షేమంగా బయటపడిన మరో ముగ్గురు


పంట కాలువలో ఉన్న కారు

పాయకరావుపేట, జనవరి 13: తాండవ షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో కారు అదుపు తప్పి పంట కాలువలోకి దూకుపోయింది. కారులో ప్రయాణిస్తున్న వారిలో ఒక మహిళకు గాయాలవ్వగా, మరో ముగ్గురు క్షేమంగా బయటపడ్డారు. వివరాల్లోకి వెళితే.. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన ఎస్.సతీశ్ తన భార్య, కుమారుడు, అత్తతో కలిసి సంక్రాంతి పండుగ సందర్భంగా నాతవరం మండలం గునుపూడిలో బంధువుల ఇంటికి కారులో బయలుదేరారు. శనివారం ఉదయం పాయకరావుపేట వద్ద నర్సీపట్నం రోడ్డులో తాండవ షుగర్ ఫ్యాక్టరీ మలుపు వద్దకు వచ్చేసరికి కారు అదుపుతప్పింది. ఎదురుగా ఉన్న భూమి ఛానెల్ పంట కాలువలోకి దూసుకుపోయింది. స్థానికులు వెంటనే కాలువలోకి దిగి కారులో ఉన్న వ్యక్తులను బయటకు తీసుకువచ్చారు. సతీశ్ అత్త నూకరత్నంకు స్వల్ప గాయాలయ్యాయి. ఆమెను తుని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	599
విజయనగరం	603
శ్రీకాకుళం	603

ఉద్యోగులను వేధిస్తున్న ప్రభుత్వం

» జీతాలు ఇవ్వకపోవడంతో పండుగ పూట పస్తులుండాల్సిన దుస్థితి
» టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగజగదీశ్వరరావు


మాట్లాడుతున్న బుద్ధ నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఏలుబడిలో పండుగ పూట కూడా ప్రభుత్వ ఉద్యోగులు పస్తులుండాల్సిన దుస్థితి ఏర్పడిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావు అన్నారు. శనివారం ఇక్కడ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వకుండా వేధింపులకు పాల్పడిన ప్రభుత్వం గతంలో ఏదీ లేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చి నప్పటి నుంచి వైసీపీ పాలకులు, ప్రభుత్వ ఉద్యోగులపట్ల కక్షసాధింపు, అహంకారపూరిత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని కోరుతున్న ఉద్యోగులను ఉద్దేశించి సకల శాఖల మంత్రి సజ్జల రామకృష్ణారెడ్డి నీచంగా మాట్లాడడం వైసీపీ నేతల పెత్తందారీతనానికి నిదర్శనమని మండిపడ్డారు. 2019 ఎన్నికలకు ముందు జగన్ ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేస్తున్నప్పుడు.. వైసీపీ అధికారంలోకి వస్తే అంగన్‌వాడీలకు తెలంగాణ కంటే ఎక్కువ జీతం చెల్లిస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు దాటినా అమలు చేయలేదన్నారు. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని అంగన్‌వాడీలు 33 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం అంగీకరించకుండా వారిని భయాందోళనకు గురిచేస్తోందన్నారు. ఇంకా సమగ్ర శిక్ష అభియాన్, ఆశ కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన హామీలను సైతం వైసీపీ పాలకులు అమలు చేయడంలేదని అన్నారు. టీడీపీ హయాంలో అన్ని మతస్థుల వారికి ప్రధాన పండుగల సమయంలో నిత్యావసర సరకులను కానుకలు అందజేయగా, వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పండుగ కానుకలను అటకెక్కించిందని విమర్శించారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి సాగనంపడానికి సిద్ధంగా వున్నారని ఆయన అన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు కోట్ని రామకృష్ణ, మళ్ల గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే మారణాయుధాలతో దాడి

» పెదరాంభద్రపురంలో వ్యక్తి హత్య కేసులో 13 మంది అరెస్టు
» ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా వెల్లడి


మీడియా సమావేశంలో ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా. పక్కన సీఐలు, ఎస్ఐలు

పాయకరావుపేట, జనవరి 13: పాయకరావుపేట మండలంలో పెదరాంభద్రపురంలో గురువారం రాత్రి పథకం ప్రకారం ఒక వర్గం వారిపై మరో వర్గం వారు మరణాయుధాలతో దాడి చేశారని, ఈ సంఘటనలో ఒక వ్యక్తి మృతిచెందాడని నర్సీపట్నం ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. శనివారం ఇక్కడ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించిన వివరాలు.. ఈనెల 11వ తేదీన పెదరాంభద్రపురంలో సీలి నూకరాజు గ్రామంలో అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద కూర్చునే గట్టుమీదకు చెప్పులతో ఎక్కాడు. అక్కడే ఉన్న గంపల నూకరాజు(బుజ్జి) చెప్పులతో ఎక్కకూడదని వారించాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి తోసుకున్నారు. అనంతరం ఎవరికివారు ఇళ్లకు వెళ్లిపోయారు.

సీలి నూకరాజు ఈ విషయాన్ని తన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు చెప్పాడు. అందరూ కలిసి గంపల నూకరాజు అంతంచూడాలని నిర్ణయించుకున్నారు. ఇనుప రాడ్లు, కర్రలతో గంపల నూకరాజు ఇంటికి వెళ్లి దాడి చేశారన్నారు. దీంతో నూకరాజు తలకు బలమైన గాయంకావడంతో మృతిచెందాడు. గంపల సత్యనారాయణ, గంపల రమణ, గంపల నాగేశ్వరరావు, కాకాడ సుబ్బారావు, గంపల బాబ్జీ గాయపడ్డారు. మృతుడి సోదరుడు గంపల సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. పోలీసులు ఐదు బృందాలుగా ఏర్పడి ఒక్క రోజు వ్యవధిలోనే 13 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సీలి సత్తిబాబు, తుమ్మలపల్లి మహేశ్, సీలి అప్పారావు, సీలి రత్నరాజు, సీలి రాజు, సీలి నూకరాజు, సీలి నాగేశ్వరరావు, సీలి వెంకటలక్ష్మి, సీలి నూకరత్నం, సీలి మరియా, సీలి నరేంద్ర, సీలి నూకరాజు, సీలి సూరిబాబులను అరెస్టు చేశారు. మరొక నిందితుడు కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిందితులు దాడికి ఉపయోగించిన మారణాయుధాలు, రెండు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెదరాంభద్రపురంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. విలేకరుల సమావేశంలో సీఐలు పి.అప్పలరాజు, పల్లా రమణయ్య ఎస్ఐలు రమేశ్, జోగారావు పాల్గొన్నారు.

సింహగిరిపై చందన స్వాముల ఆందోళన


ఆందోళన చేస్తున్న చందన స్వాములు

సింహాచలం, జనవరి 13 : ఉమ్మడి విశాఖ జిల్లాలోని చోడవరం, మునగపాక, మన్యం ప్రాంతాలకు చెందిన చందన స్వాములు శుక్రవారం రాత్రి గోపాలపట్నం పెట్రోల్ బంక్ కూడలి నుంచి ర్యాలీగా సింహాచలం చేరుకున్నారు. దేవస్థానం బస్టాండ్‌లోని సింహాద్రి మఠం ఆధ్వర్యంలో జరిగిన నృసింహస్వామి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం శనివారం వేకువజామున ప్రభాతారాధనలు ముగించుకుని మాలల విసర్జనకు సింహగిరి చేరుకోగా ఉచితంగా అంతరాలయం ప్రవేశం లేదంటూ అధికారులు అడ్డుకోవడంతో ఆందోళన చేపట్టారు.

ఏటా దీక్షల విరమణకు వచ్చే స్వాములకు ఉచిత రవాణా, అంత రాలయ దర్శనం కల్పించడం ఆనవాయితీ. కానీ ఈసారి అందుకు విరుద్ధంగా దేవస్థానం అధికారులు అంతరాలయ దర్శనానికి రూ.300 టికెట్లు తీసుకోవాలనడంతో స్వాములు ఆలయ ప్రధాన రాజగోపురం ఎదుట బైఠాయించి ఈఓకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కనీసం తాము శిరస్సున దాల్చిన తిరుముడులను స్వీకరించేందుకు దేవస్థానం తరఫున ఏర్పాట్లు చేయకపోవడం ఏమిటని వారు ప్రశ్నించారు.

జీతాల కోసం ఆస్పత్రి కార్మికుల ధర్నా



ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు


కె.కోటపాడు, జనవరి 13: వైద్య విధాన పరిషత్ ప్రభుత్వాస్పత్రిలో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్, వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు వై.ఎన్.భద్రం డిమాండ్ చేశారు. శనివారం ఆస్పత్రి ఆవరణలో షేక్ మీరా సాహెబ్ అధ్యక్షతన ఏఐటీయూ కార్మికులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రం మాట్లాడుతూ రెండు నెలలుగా జీతాలు అందకపోతే కార్మికులు పండగ ఏవిధంగా జరుపుకుంటారన్నారు. 549 జీవో ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వేచలపు కాసుబాబు, దేముడుబాబు, జనార్దన్, నాగరత్నం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తూర్పు నావికాదళాన్ని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు


తూర్పునావిదళ అధికారులతో ట్రైనీ ఐఏఎస్ అధికారులు

విశాఖపట్నం, జనవరి 13 : ముస్సోరి ఎల్‌బీఎస్ ఎన్‌ఏఏకు చెందిన 19 మంది ట్రైనీ ఐఏఎస్‌ల బృందం శుక్రవారం తూర్పు నావికాదళాన్ని సందర్శించింది. తూర్పు నావికాదళ ప్రధాన కార్యాలయ అధికారులు వారికి నేవీ పనితీరు, దేశ రక్షణలో ఇండియన్ నేవీ పాత్ర గురించి వివరించారు. అలాగే నేవీ ఉపయోగించే ఆయుధాలు చూపించి వాటి పనితీరును వివరించారు. నేవల్ ఎయిర్ స్టేషన్ ఐఎన్ఎస్ డేగా నుంచి ఎయిర్ వింగ్ ఆపరేషన్ విధానాన్ని తెలిపారు. అనంతరం ఐఎన్ఎస్ రన్‌విజయ్ యుద్ధ నౌకను సందర్శించే అవకాశం కల్పించారు. నౌకపై ఉన్న ఆయుధాలు, సెన్సార్‌లు శత్రువులను ఎదుర్కొనే విధానం వివరించారు. కమొండర్ సంతాన రూ వారితో ప్రత్యేకంగా సమావేశమై వివిధ అంశాలను తెలిపారు.

జనారణ్యంలోకి దుప్పి


చెట్టు కింద సేద తీరుతున్న దుప్పి

విశాఖపట్నం, జనవరి 13 : అటవీ ప్రాంతంలో ఆహారం లభించకపోవడంతో పలు జంతువులు జనారణ్యంలోకి వస్తున్నాయి. శనివారం మధ్యాహ్నం జూపార్కు ప్రాంతంలోని సీతకొండ నుంచి విశాలాక్షినగర్ కాలనీలోని ప్రధాన రహదారిపైకి ఓ దుప్పి వచ్చింది. దీనికి అటుగా వెళ్లేవారు ఫొటోలు, వీడియోలు తీస్తూ హడావిడి చేశారు. వన్య ప్రాణులు కాలనీల్లోకి రాకుండా అటవీ శాఖాధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

19 నుంచి పలు రైళ్లు రద్దు.. గమ్యం కుదింపు

విశాఖపట్నం, జనవరి 13: వాల్తేరు డివిజన్ పరిధిలోని సింగపూర్‌రోడ్డు- రాయగడ సెక్షన్ల మధ్య నాన్ ఇంటర్ లాకింగ్ నిర్మాణ పనులు చేపడుతున్నందున ఈనెల 19వతేదీ నుంచి పలు రైళ్లను రద్దు చేయగా, కొన్ని రైళ్ల గమ్యాలను కుదించడంతోపాటు రీ షెడ్యూల్ చేసినట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు.

రద్దయిన రైళ్ల వివరాలివి..

ఈనెల 19వతేదీ నుంచి 27 వరకు విశాఖ-రాయపూర్ ప్రత్యేక పాసింజర్ రైలు (08528), విశాఖ-భవానిపట్న ప్రత్యేక పాసింజర్ (08504), విశాఖ-కోరాపుట్ ప్రత్యేక పాసింజర్ (08546) రద్దు చేశారు. ఈనెల 20వతేదీ నుంచి 28 వరకు రాయపూర్-విశాఖ ప్రత్యేక పాసింజర్ (08527), భవానిపట్న-విశాఖ ప్రత్యేక పాసింజర్ (08503), కోరాపుట్-విశాఖ ప్రత్యేక పాసింజర్ (08545) రద్దయ్యాయి.

రీ షెడ్యూల్...

ఈనెల 19, 22, 26 తేదీల్లో విశాఖ-కోరాపుట్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ (18512); ఈనెల 20, 23, 27 తేదీల్లో కోరాపుట్-విశాఖ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ (18511); ఈనెల 18, 21, 25 తేదీల్లో తిరుపతి-బిలాస్‌పూర్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ (17482), ఈనెల 20, 23, 27తేదీల్లో బిలాస్‌పూర్-తిరుపతి బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ (17481) రద్దు చేసినట్టు డీసీఎం పేర్కొన్నారు. ఈనెల 19, 20తేదీల్లో గుంటూరులో బయలుదేరి రాయగడ వచ్చే 17243 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైలును విజయనగరం వరకు, తిరుగు ప్రయాణంలో రాయగడ నుంచి గుంటూరు వెళ్లాల్సిన 17244 నంబరు గల రైలు ఈనెల 20, 27న విజయనగరం నుంచి బయలుదేరి గుంటూరు చేరనుంది. విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (22847) ఈనెల 21వతేదీన విశాఖలో ఐదు గంటలు ఆలస్యంగా, ఎల్‌టీటీ-విశాఖ ఎక్స్‌ప్రెస్ (22848) ఈనెల 23వతేదీన ఎల్‌టీటీ నుంచి రెండు గంటలు ఆలస్యంగా నడపుతూ రీషెడ్యూలు చేశారు. అలాగే, విశాఖ-భగత్‌కికోఠి ఎక్స్‌ప్రెస్ (18573) ఈనెల 25న విశాఖలో ఎనిమిది గంట లు ఆలస్యంగా బయలుదేరనుంది. అలాగే సంబల్‌పూర్-నాందేడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (20810) ఈనెల 20, 22, 23, 27తేదీల్లో సంబల్‌పూర్‌లో నాలుగు గంటలు ఆలస్యంగా బయలుదేరేలా రీ షెడ్యూల్ చేశారు.

సీబీసీఎన్‌సీ నూతన కార్యవర్గం


ఉత్తర సర్కార్ బాప్టిస్టు చర్చి సంఘాల నూతన కార్యవర్గం

పాయకరావుపేట, జనవరి 13: ఉత్తర సర్కార్ బాప్టిస్టు చర్చి సంఘాల (సీబీసీఎన్‌సీ) నూతన కార్యవర్గం ఎన్నికలు శనివారం స్థానిక కల్వరి బాప్టిస్టు చర్చిలో జరిగాయి. సీబీసీఎన్‌సీ 69వ మహాసభ, సర్వసభ్య సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా టి.ఐజాక్(విశాఖపట్నం), ఉపాధ్యక్షురాలిగా కె.సుభద్ర(కాకినాడ), కార్యదర్శిగా ఏడీకే.జాన్(తుని), రికార్డింగ్ కార్యదర్శిగా ఎస్ఆర్.కుమార్(నర్సీపట్నం), కోశాధికారిగా జి.ఎలీషా(పిఠాపురం), ట్రస్ట్ అసోసియేషన్ ఛైర్మన్‌గా వై.కృష్ణమూర్తి(విశాఖపట్నం), ట్రస్ట్ కార్యదర్శిగా ఎ.జోషీపాల్(తుని), సభ్యునిగా పల్లా విలియంకేరి(పాయకరావుపేట) ఎన్నికయ్యారు.

పుణ్యకోటి వాహనంపై ఊరేగిన స్వామివారు


స్వామివారి తిరువీధి సేవ


పుణ్యకోటి వాహనంపై దర్శనమిస్తున్న స్వామివారు

నక్కపల్లి, జనవరి 13: మండలంలోని ఉపమాకలో శనివారం మధ్యాహ్నం పుణ్యకోటి వాహనంపై స్వామివారి తిరువీధి సేవ జరిగింది. అంతకుముందు ఆలయానికి ఆనుకుని వున్న పూదోటకు గోదాదేవి అమ్మవారిని తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు తిరుప్పావై పాశుర విన్నపం చేశారు. అనంతరం పుణ్యకోటిపై ఉభయదేవేరులతో స్వామివారిని, రాజాధిరాజ వాహనంపై గోదాదేవి అమ్మవారిని అలంకరించి వీధుల్లో ఊరేగించారు.

సింహాద్రి మొదటి యూనిట్‌లో విద్యుదుత్పత్తి పునరుద్ధరణ

పరవాడ, జనవరి 13: సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం(ఎన్టీపీసీ)లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మొదటి యూనిట్‌లో ఉత్పత్తిని శుక్రవారం అర్ధరాత్రి పునరుద్ధరించారు. ఈ యూనిట్‌లో శుక్రవారం ఉదయం సాంకేతిక లోపం తలెత్తడంతో ఉత్పత్తి నిలిచిపోయిన సంగతి తెలిసిందే. అధికారులు రంగంలోకి మరమ్మతు పనులు చేపట్టారు. కొద్ది గంటల్లోనే విద్యుదుత్పత్తిని పునరుద్ధరించారు. ప్రస్తుతం ప్లాంట్‌లోని అన్ని యూనిట్‌ల్లో ఉత్పత్తి పూర్తిస్థాయిలో జరుగుతున్నదని అధికారులు వెల్లడించారు.

రేపటి స్పందన రద్దు

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 13: కలెక్టరేట్‌లో ఈ నెల 15వ తేదీన నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు డీఆర్‌వో బి.దయానిధి శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం ప్రభుత్వ సెలవు దినం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు.

పుంజుకున్న ధరలు

» నర్సీపట్నం కోళ్లు సంతలో పండగ శోభ
» చవల జాతి కోడి పుంజు ధర రూ.10 వేలు


నర్సీపట్నంలో నాటు కోళ్ల మార్కెట్

నర్సీపట్నం, జనవరి 13 : సంక్రాంతి పండగ అంటే పందెం కోళ్ల కు ఎంతటి గిరాకీ ఉంటుందో అందరికీ తెలిసిందే. స్థానిక నూకాలమ్మ గుడి సమీపంలోని నాటు కోళ్ల సంతలో పండగ సందడి కనిపించింది. ప్రతీ శనివారం నర్సీపట్నం చుట్టు పక్కల గ్రామాల నుంచి రైతులు నాటు కోళ్ల తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తారు. సంక్రాంతి పండగ అంటేనే కోడి పందాలకు ఎంతటి ప్రసిద్ధో అందరికీ తెలిసిందే. నర్సీపట్నం చుట్ట పక్కల గ్రామాలలో కోడి పెందెములు గట్టిగానే జరుగుతాయి. దీంతో శనివారం పందెం కోళ్ల కోసం జనం ఎగబడ్డారు. ఒక్కొక్క కోడి పుంజు రూ.3వేలు నుంచి రూ.10 వేలు వరకు విక్రయించారు. చవల రకం జాతికి చెందిన పందెం కోడి ధర రూ.10వేలు పలికింది. అదే విధంగా మరో అబ్బుర్స్ జాతి కోడి పుంజు రూ.5500లకు విక్రయించారు.


చవల జాతి పందెం కోడి పుంజు


అబ్బుర్స్ జాతి పందెం కోడి

రేపటి నుంచి మకర జ్యోతి ఉత్సవాలు

- అయ్యప్ప ఆలయంలో రెండు రోజుల పాటు నిర్వహణ
- ముహూర్తపు రాట వేసిన ఉత్సవ కమిటీ సభ్యులు



అయ్యప్ప ఆలయం వద్ద ఉత్సవ రాట వేస్తున్న కమిటీ సభ్యులు

నర్సీపట్నం, జనవరి 13 : పట్టణంలో స్వామి అయ్యప్ప ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో మకర జ్యోతి ఉత్సవాలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఆలయ కమిటీ సభ్యులు ఉత్సవ రాట వేసి శ్రీకారం చుట్టారు. సంక్రాంతి పండగ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు నిర్వహిస్తారు. సాయంత్రం స్వామి వారి రథయాత్ర, ఎన్టీఆర్ మినీ స్టేడియంలో క్లాసికల్ నృత్య ప్రదర్శన, ప్రముఖులకు సన్మానాలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ వంటి వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కనుమ పండగ రోజున రోషన్‌లాల్ ఆర్కెస్ట్రా, రేలారే రేలా ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్, జాలమూరి రాజ్‌కుమార్, వెలగా నారాయణరావు దంపతులు, లంక ప్రసాద్, గోవింద్, దన్నిన రాంబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో ఎన్నో అభివృద్ధి పనులు : బూడి



మహిళలకు పథకాలను వివరిస్తున్న ముత్యాలనాయుడు

దేవరాపల్లి, జనవరి 13 : నాలుగున్నరేళ్లలో దేవరాపల్లిలో ఎన్నెన్నో అభివృద్ధి పనులు చేపట్టామని, ఇందుకు సీఎం జగన్ సహాయ సహకారాలు అందించారని ఉప ముఖ్యమంత్రి బూడిముత్యాలనాయుడు అన్నారు. నాలుగు రోజులపాటు మండల కేంద్రంలో గల రెండు సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ముగిసిన సందర్భంగా రైవాడ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడుతూ ఆయా పనుల వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో ఎంపీపీ రాజేశ్వరి, భాస్కరరావు, బూరే బాబూరావు, మొల్లి కృష్ణమూర్తి, సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు బంగారంపాలెం, కొల్లివానిపాలెం కాలనీల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.

తిరిగిరాని లోకాలకు..

... 5వ పేజీ తరువాయి

తాళ్లపాలెం సమీపంలో బ్రిడ్జి వద్ద కారు అదుపుతప్పింది. ఎడమ వైపున ఉన్న రక్షణ స్తంభాలను ఢీకొని కిందకు దూసుకువెళ్లి బోల్తా పడింది. దీంతో గిరిశ్ అచ్యుతకుమార్ మినహా మిగిలిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. భాస్కరరావు పరిస్థితి ఆందోళనకరంగా వుండడంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. మిగిలిన ముగ్గురు ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గిరీష్ అచ్యుతకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ సుందరమ్మ తెలిపారు.

ఎట్టకేలకు మోక్షం

... 5వ పేజీ తరువాయి

రైతులు, కార్మికుల బ్యాంకు ఖాతాలకు బకాయిలు జమకాలేదు. రైతులు ఫ్యాక్టరీకి వచ్చి వాకబు చేస్తుంటే.. అదిగో ఇదిగో అంటూ అధికారులు నెట్టుకొస్తున్నారు. జీవో విడుదలైనప్పటికీ ఫ్యాక్టరీ ఖాతకు డబ్బులు జమకాకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పలుమార్లు ప్రదక్షిణలు చేయగా ఎట్టకేలకు రైతులకు, కార్మికులకు బకాయిల చెల్లింపు కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. శుక్రవారం రాత్రి ఫ్యాక్టరీ ఖాతాలో రూ.12.8 కోట్లు జమ అయ్యాయి. వీటిలో రూ.7.11 కోట్లు చెరకు బకాయిలు, రూ.2.19 కోట్లు రవాణా చార్జీలు, రూ.2 కోట్లు కార్మికుల వేతన బకాయిలు, రూ. కోటి రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లింపు, రూ.50 లక్షలు విద్యుత్ బకాయిల కోసం కేటాయింపులు జరిగాయి. శనివారం నుంచి సోమవారం వరకు బ్యాంకులకు వరుసగా సెలవులు కావడంతో సంక్రాంతి పండుగ అనంతరం మంగళవారం నుంచి రైతులు, కార్మికుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని ఫ్యాక్టరీ అధికారులు పేర్కొన్నారు.

ఆవఖండంలో రియల్ దందా!

... 5వ పేజీ తరువాయి

పరిసరాల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వి, రాత్రి వేళ్లలో ట్రాక్టర్లు, టిప్పర్లలతో ఆవఖండం భూములకు చేరుస్తున్నారు.

ఫిర్యాదులు చేసినా పట్టించుకోని రెవెన్యూ

వ్యవసాయ భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్ వేయాలంటే స్థానిక రెవెన్యూ అధికారులతో పాటు వీఎంఆర్‌డీఏ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ సదరు రియల్ ఎస్టేట్ సంస్థకు తెరవెనుక అధికార పార్టీ ముఖ్యనేత వుండడంతో ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనకడుగు వేస్తున్నట్టు తెలిసింది. ఆవఖండం భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా రియల్ వెంచర్ వేసేందుకు పనులు చేస్తుండం, గ్రావెల్‌ను అక్రమ రవాణా చేస్తుండడంపై స్థానికులు పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కాగా ఆవఖండం భూముల్లో అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ వెంచర్ పనులు జరుగుతుండడంపై స్థానిక వీఆర్‌ఓ నాగరాజును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, రియల్ ఎస్టేట్ లేఅవుట్ వేస్తున్నట్టు ఫిర్యాదు అందిన మాట వాస్తవమేనని చెప్పారు. వెంచర్ పనులు నిలిపేసి, కన్వర్షన్ ఫీజు చెల్లించిన తరువాతే పనులు చేపట్టాలని సదరు రియల్ ఎస్టేట్ సంస్థకు నోటీసులు జారీ చేశామని తెలిపారు.



బుచ్చెయ్యపేటలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు



చీడికాడలో భిక్షాటన చేస్తున్న దృశ్యం

అంగన్‌వాడీల ఆగ్రహజ్వాల

- ప్రభుత్వ తీరుపై నిప్పులు
- ఎస్మా కాపీల ప్రతులు దహనం
- న్యాయం జరిగే వరకు తగ్గేది లేదని ప్రతిన

బుచ్చెయ్యపేట, జనవరి 13 : డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఇక్కడ ఏర్పాటైన దీక్షా శిబిరంలో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ పదకొండు డిమాండ్ల పరిష్కారమయ్యే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎలిశెట్టి అమ్మాజీ, కోవెల వెంకటలక్ష్మి, ఆది వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ : అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుండడం తగదని సీఐటీయూ మండల కార్యదర్శి రొంగలి దేముడు నాయుడు విమర్శించారు. సదరు కార్యకర్తలు చేస్తున్న సమ్మె శనివారం 32వ రోజుకు చేరుకున్న సందర్భంగా సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ సందర్భంగా చీడికాడ గ్రామంలో వీరంతా భిక్షాటన చేశారు. ఈ సమ్మెలో సంఘం నాయకులు ఎం.జానకి, రాజు లమ్మ, రామలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : అంగన్‌వాడీల సంఘం నాయకులతో ప్రభుత్వం జరిపిన చర్చలు విఫలం కావడంతో సమ్మెను మరింత ఉధృతం చేస్తున్నారు. ఇందులో భాగంగా వారంతా ఆగ్రహం చెంది ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి దిష్టిబొమ్మను భోగిమంటల్లో వేసి దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు అమ్మాజీ, జి.వరలక్ష్మి, పద్మ, సన్యాసమ్మ, గాయత్రిలతో పాటు వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్నతో పాటు పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రావికమతంలో భోగిమంట చుట్టూ నిలిచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు

రావికమతం : అగన్‌వాడీల సమ్మెకు వ్యతిరేకంగా ప్రభుత్వం జారీ చేసిన ఎస్మా కాపీల ప్రతులను శనివారం వారంతా ఇక్కడ తగులబెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఓవైపు సమ్మెను విరమించాలని కోరుతూనే, మరో వైపు సమ్మెకు వ్యతిరేకంగా ఎస్మా చట్టం ప్రయోగించాలని జీవో జారీ చేయడం అన్యాయమన్నారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

బీసీల ద్రోహి జగన్‌కు ఓటుతో బుద్ధి చెప్పండి

- 'జయహో బీసీ' సదస్సులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావు పిలుపు
- టీడీపీ హయాంలోనే న్యాయం జరిగిందని వెల్లడి





సదస్సులో ప్రసంగిస్తున్న బుద్ధ నాగజగదీశ్వరరావు.., వివిధ ప్రాంతాల నుంచి హాజరైన బీసీలు

రోలుగుంట, జనవరి 13 : బీసీల ద్రోహి జగన్ అని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావు పిలుపునిచ్చారు. రోలుగుంటలో శనివారం ఏర్పాటైన 'జయహో బీసీ' సదస్సులో ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ నాలుగున్నరేళ్లలో జగన్‌రెడ్డి బీసీలను అణగదొక్కి, రెడ్లతో రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి బీసీల ద్రోహిని వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. ప్రస్తుతం బీసీలపై దాడులు, అక్రమ కేసులు, హత్యలు పెరిగిపోయాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే ప్రత్యేక రక్షణ చట్టం తెచ్చి బీసీలను ఆదుకుంటామని స్పష్టం చేశారు. బీసీల అండతో గద్దెనెక్కిన జగన్ వారిపైనే దాడులు, అక్రమ అరెస్టులు చేయడం దారుణమన్నారు. వారికోసం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రూపాయి కూడా కేటాయించలేదని ఎద్దేవా చేశారు. బీసీలంతా చంద్రబాబు కోసం ఎదురు చూస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో ఆదరణ పథకం ద్వారా బీసీలకు పెద్దఎత్తున లబ్ధి చేకూర్చినట్టు చెప్పారు. పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు పంచాడ చంద్ర, పార్టీ మండల అధ్యక్షుడు గుములూరు చంద్రమౌళి, ఎంపీటీసీ సుర్ల రామకృష్ణ, బీసీ యాత సాధికార రాష్ట్ర కన్వీనర్ ఒనుం శ్రీనివాసరావు, దేవాంగుల కన్వీనర్ బత్తుల లక్ష్మి, బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పండగపూట అరకొర రేషన్ తగదు'

మాకవరపాలెం, జనవరి 13 : సంక్రాంతి పండగ సమయంలోనూ అరకొరగా రేషన్ సరకులు పంపిణీ చేయడం వైసీపీ ప్రభుత్వానికి తగదని టీడీపీ మండల కార్యదర్శి బుచ్చి రాంప్రసాద్ తదితర నాయకులు వాపోయారు. శనివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో రేషన్ బియ్యం తప్ప ఇతర సరకులు ఏవీ ఇవ్వడం లేదన్నారు. కనీసం పండగరోజుల్లోనైనా పంచదార, కందిపప్పు ఇవ్వాలన్న ఆలోచన లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో సంక్రాంతి పండగకు ఎన్నో రకాల సరకులను చంద్రబాబు కార్డుదారులకు ఉచితంగా అందజేసేవారన్నారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో రేషన్ పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందిగా వారు కోరారు.

సమగ్ర శిక్ష సిబ్బందికి ఆర్థిక సాయం



సమగ్ర శిక్ష సిబ్బందికి నగదు అందిస్తున్న ఉపాధ్యాయులు

దేవరాపల్లి, జనవరి 13 : సమగ్రశిక్ష సిబ్బంది 22 రోజల పాటు సమ్మె చేయడంతో పాటు, మూడు నెలలుగా వారికి వేతనాలు లేకపోవడంతో మండలంలోని ఉపాధ్యాయులంతా కలిసి వారికి బాసటగా నిలిచారు. ఇందులో భాగంగా శనివారం రూ.70వేలను ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ విశాఖపట్నం అధ్యక్షుడు కొటాన శ్రీనివాసరావు, ఎ.కె.ఎస్.నాయుడు, బోజంకి శ్రీను, చిరికి సింహాచలంనాయుడు, నౌడు అప్పారావు, కొయ్యి శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీలు



దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న చిట్టినాయుడు

మాడుగుల, జనవరి 13 : మండల కేంద్రంలోని ఓ ఎరువుల దుకాణంలో ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు వి.చిట్టినాయుడు శనివారం తనిఖీలు జరిపారు. ఈ సందర్భంగా షాపులో ఉన్న పశుదాణాను పరిశీలించి పోషక విలువలపై ఆరా తీశారు. అంతేకాకుండా విశాఖలోని ల్యాబ్‌కు శాంపిల్స్‌ను పంపించారు. నాణ్యత, పోషక విలువలతో కూడిన దానా విక్రయించాలన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఎల్ పొన్నవోలులో గల దుకాణాన్ని కూడా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య శాల సిబ్బంది పాల్గొన్నారు.

'గోవాడ'కు పూర్వవైభవం తేవడమే లక్ష్యం'



ధర్మశ్రీని సత్కరించి బొకే అందిస్తున్న గుర్తింపు నాయకులు

చోడవరం, జనవరి 13 : గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి పూర్వవైభవం తీసుకు రావడమే తమ లక్ష్యమని విప్ ధర్మశ్రీ అన్నారు. చెరకు రైతుల బకాయిలు విడుదలైన సందర్భంగా శనివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. రైతులకు, కార్మికులకు నిధులు విడుదల చేసిన సీఎం జగన్‌తో పాటు, వైసీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్, డిప్యూటీ సీఎం బూడిలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నరసింగరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, డాక్టర్ బండారు సత్యనారాయణ, కాంట్రేగుల డేవిడ్, పార్టీ మండల అధ్యక్షుడు డీవీఆర్, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు. డీసీసీబీ డైరెక్టర్ మూడెడ్ల శంకరరావు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఫ్యాక్టరీ కార్మికులకు వేతనాలు, రైతులకు బకాయిల విడుదల విప్ ధర్మశ్రీ కృషి వల్లే సాధ్యమైందని గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు కేవీవీఎస్ భాస్కరరావు అన్నారు. ఈ సందర్భంగా శనివాయం ధర్మశ్రీని ఘనంగా సత్కరించారు. అలాగే, చోడవరం సహకార సంఘం అధ్యక్షుడు దన్నిన వెంకటరావు ఆధ్వర్యంలో రైతులు గోవాడ షుగర్స్ ఎండీ వి.సన్యాసినాయుడుకు, విప్ ధర్మశ్రీలకు స్వీట్లు తినిపించారు. గుర్తింపు కార్మిక సంఘం నాయకులు నాగేశ్వరరావు, తలారి సత్యనారాయణ, గుమ్మాళ్ల త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రానికి చంద్రబాబుతోనే మంచి రోజులు'



అడ్డల్లోవ గ్రామంలో పర్యటిస్తున్న చింతకాయల రాజేశ్

గొలుగొండ, జనవరి 13 : రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు తనయుడు, మునిసిపల్ కౌన్సిలర్ చింతకాలయ రాజేశ్ అన్నారు. కంఠారం పంచాయతీ శివారు అడ్డల్లోవ గ్రామంలో శనివారం పర్యటించి పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో వ్యవస్థలన్నీ సర్వనాశనం అయ్యాయని ఆరోపించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధే తప్ప, వైసీపీ వచ్చి చేసింది ఏమీ కానరాలేదని ఎద్దేవా చేశారు. గత నాలుగున్నరేళ్లలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, మళ్లీ అందరికీ మంచిరోజులు రావాలంటే ఎన్నికల్లో టీడీపీని ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. నాయకులు బెల్లపు కొండలరావు, రూపల నాయుడు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటేసే అవకాశం : ఆర్డీవో



దివ్యాంగులకు సరకులు అందజేస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం, జనవరి 13 : దివ్యాంగులు ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించినట్టు ఆర్డీవో జయరాం తెలిపారు. సంక్రాంతి సందర్భంగా రామారావుపేట సంపత్ వినాయక ఆలయ కమిటీ ప్రతినిధి మామిడి రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం ఆయన ఇక్కడ దివ్యాంగులకు నిత్యావసర సరకులు పంపిణీ చేసి మాట్లాడారు. బీఎల్‌వో ఇచ్చిన దరఖాస్తులు నింపి అందజేస్తే దివ్యాంగులకు పోస్టల్ బ్యాలెట్ అందజేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, వెలగా నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పల్లె పిలుస్తోంది రా.. కదలిరా..'

విజయవంతానికి టీడీపీ నాయకుడు 'బత్తుల' పిలుపు



బుచ్చెయ్యపేట, జనవరి 13 : టీడీపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఆదివారం నుంచి 'పల్లె పిలుస్తోంది రా... కదిలి రా...' కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు నియోజవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహించాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు పిలుపునిచ్చారు. శనివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి పట్టినకీడు తొలగిపోవాలని కోరుకుంటూ వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక కార్యక్రమాల ఫొటోలను భోగి మంటల్లో వేసి దహనం చేయాలన్నారు. అలాగే గ్రామాల్లోనివారు ఓటరు జాబితాలో పేర్లను సరిచూసుకోవాలన్నారు. అలాగే రాష్ట్రాభివృద్ధి మేనిఫెస్టోలో చంద్రబాబు పేర్కొన్న సూపర్ సిక్స్ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయాలని సూచించారు.

ఘనంగా బాలయేసు దేవాలయ మహోత్సవం



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

రావికమతం, జనవరి 13 : కొత్తకోటలో గల బాలయేసు దేవాలయ (ఆర్‌సీఎం గుడి) మహోత్సవం శనివారం ఘనంగా ముగిసింది. మూడురోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో చర్చి ఫాదర్ అజయ్ ఆధ్వర్యంలో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని పలు చర్చిల నుంచి ఫాదర్లు, క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ముగింపోత్సవం సందర్భంగా బాలయేసు విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు.

మాడుగుల మార్కెట్‌కు సంక్రాంతి శోభ



ఘాట్‌రోడ్డులోని ఓ వస్త్ర దుకాణంలో రద్దీ

మాడుగుల, జనవరి 13 : సంక్రాంతి పండగ సందర్భంగా మాడుగులలో శనివారం రద్దీ నెలకొంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి పండగకు అవసరమైన సామగ్రి కొనుగోలుకు పెద్ద సంఖ్యలో రావడంతో ఎటుచూసినా కోలాహల వాతావరణం నెలకొంది. ప్రధానంగా వస్త్రదుకాణాల్లో ఈ రద్దీ మరింత అధికంగా కనిపించింది. అలాగే, పూజకు అవసరమైన కొబ్బరికాయలు, అరటిపండ్లు, చెరుకుగెడలు, ఎర్రదుంపలు తదితరాలను కొనుగోలు చేశారు.

క్రీడల్లో మెరిసిన దిబ్బపాలెం క్రీడాకారులు



క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన దిబ్బపాలెం మహిళలు

చీడికాడ, జనవరి 13 : మండల కేంద్రం చీడికాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి లో క్రీడా పోటీల్లో దిబ్బపాలెం గ్రామానికి చెందిన పలువురు క్రీడాకారులు ప్రథమస్థానంలో నిలిచి నియోజకవర్గస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఆడుదాం ఆంధ్ర పోటీల్లో భాగంగా ఈనెల 10వ తేదీన జరిగిన కబడ్డీ బాలికల విభాగంలో దిబ్బపాలెం క్రీడాకారులకు మొదటిస్థానం రాగా, రెండవ స్థానం జి.కొత్తపల్లికి వచ్చింది.

వాలీబాల్‌లో మొదటిస్థానం జి.కొత్తపల్లి, రెండవ స్థానం దిబ్బపాలెం, కబడ్డీ బాలుర విభాగంలో మొదటిస్థానం దిబ్బపాలెం, రెండవది భైలపూడి, వాలీబాల్ బాలుర విభాగంలో మొదటిస్థానం ఖండివరం, రెండవది కోనాం జట్లకు లభించాయి. అలాగే 11న జరిగిన ఖోఖోలో బాలుర విభాగంలో దిబ్బపాలెం మొదటిస్థానంలో నిలవగా, రెండవ స్థానం వరహాపురం, బాలికల విభాగంలో ఖోఖో దిబ్బపాలెం మొదటిస్థానం రాగా, రెండవది చీడికాడ, 12న జరిగిన బాలుర షటిల్ పోటీల్లో మొదటిస్థానం దిబ్బపాలెం, రెండవ స్థానం వరహా పురం క్రీడాకారులకు దక్కాయి. ఇంతవరకూ జరిగిన అన్ని మండల స్థాయి పోటీల్లో దిబ్బపాలెం క్రీడాకారులు మొదటిస్థానంలో నిలవడంతో వీరిని గ్రామ పెద్దలు, యువత అభినందించారు.